# తత్సమ సమాసం

అడయారు నుంచి కొడంబాకం వెళ్ళవలసిన పని ఎదురయింది. ఒక రోజు కాదు వరసగా పదకొండు రోజులపాటు ప్రతి రోజూ సాయంకాలం ఆరుగంటలనుంచి ఆరున్నరవరకు అక్కడ – ప్రభాకరం యింట్లో – తప్పనిసరిగా కూర్చోవాలి.

ముందురోజు ప్రభాకరం వచ్చి కలుసుకున్నాడు.

ఎప్పుడో పది సంవత్సరాల క్రితం పరిచయం అతనితో.

ఎలా పరిచయం అయిందో ఎంతగుర్తు చేసుకుందాం అనుకున్నా, మనసుకు అందలేదు.

అప్పుడే ఒక సీరియస్ రచన పూర్తి చేసి గదిలోనుంచి ముందు హాల్లోకి వస్తున్నాడు నారాయణ. హాలు తలుపు తీసే వుంది. హాల్లో గిరిజ కూర్చుని యేవో పుస్తకాలు చూసుకుంటూంది. నారాయణ తాను ముందుకు వచ్చేసినట్లు ఆమెతో చెబుదామని నోరు విప్పేలోపలే హాలు గుమ్మం ముందు ఒక ఆకారం కనిపించింది. ఎవరు? అని కళ్లు పెద్దవి చేసుకుని చూశాడు నారాయణ. తెలియదు ఈయన ఎవరో. అతను హాలు గుమ్మం దగ్గరకు వెళ్ళిపోయి అతనికి ఎదురుగా నిలుచున్నాడు. 'అవును. ఇదే. మీరు...?' అన్నాడు.

'మీరు యే మాత్రం మారలేదు నారాయణగారూ; నేను మాత్రం బాగా మారిపోయాను. నేను ప్రభాకరాన్ని. నన్ను గుర్తించడం మీకు కష్టమే' అన్నాడు ఆ మనిషి.

నారాయణ యే మాత్రం తొట్రుపాటు పడకుండా, 'అవును. మిమ్మల్ని నేను గుర్తుపట్టని మాట నిజమే. ఫరవాలేదు. రండి, లోపలికి' అని అతన్ని హాల్లోకి ఆహ్వానించి సోఫా చూపించాడు.

గిరిజ అప్పటికి లేచి నించున్నది. నారాయణ యెలానూ యివతలకు వచ్చేశాడు గనుక యింక తనకు యిక్కడేం పనిలేదు. ఎవరో పూర్వ పరిచయస్థుడయివుంటాడు. వాళ్లు మాటల్లో పడ్డారంటే భోజనాల టైందాక – అదీ తను గుర్తుచేస్తే తప్ప – మళ్లీ యీ లోకంలోకి రారు అనుకుంది.

ప్రభాకరం పరిచయస్థుని లాగానే రకరకాల కుశల ప్రశ్నలు వేస్తున్నాడు. నారాయణకు అతను యెవరో గుర్తుకు వచ్చిన మాట యథార్థమే గాని, ఎప్పుడు ఎలాంటి పరిచయస్థుడో తెలియదు. దాని కోసం మెదడంతా పీక్కోవడం ఎందుకు, అదే తగిన సమయానికి తెలిసి వస్తుందిలే అని అతనితో మాటలు కలుపుతూ, అడిగిన వాటికి తడీపొడిగా జవాబులు చెబుతూ కూర్చున్నాడు.

‘మీరు నేను కలుసుకున్నది నాలుగయిదు మార్లు మాత్రమే. తరువాత నేను మదరాసు వదిలి వెళ్లిపోయాను. ఏడెనిమిదేళ్లు ‘నమక్కల్’లో ఉండిపోయాను. మళ్లీ యిక్కడికి వచ్చి ఒక సంవత్సరం అయింది’, అన్నాడు ప్రభాకరం తన ప్రవర అంతా చెప్పుకుంటూ.

‘ఎక్కడ వుంటున్నారు?’

‘కోడంబాకంలో వుంటున్నాను. గాంధీనగర్‌లో చిన్న పని వుండి యిటువయిపు వచ్చాను. ఆ పని అనుకున్న దానికన్నా చాలముందుగానే పూర్తయిపోయింది. వెంటనే యింటికి వెళ్లిపోవడం ఎందుకని అడయారులో నా పూర్వమిత్రుడు కృష్ణమూర్తిని కలుసుకుందామని యిటు వచ్చాను.

‘కృష్ణమూర్తి యిల్లు ఆ ఎదురు గుండా వున్నదే’ అన్నాడు నారాయణ.

‘అవును. వాచ్‌మెన్ ఆ యిల్లే చూపించాడు. అయితే యిల్లు తాళం వేసివుంది. కృష్ణమూర్తి వూళ్లో లేడా? మీ కేమయినా తెలుసా?

‘అతను వూళ్లో లేడు. ఈ నెలాఖరుకుగాని రాడనుకుంటాను. అతని భార్య, కొడుకు వుండాలే యింట్లో!’ అన్నాడు నారాయణ.

‘లేరు. ఇల్లు తాళం వేసి వుంది.’

‘అలాగా ఏదయినా పనిమీద బయటకు వెళ్ళివుంటారు.’

'ఆ యింటి తాళం చూచి మళ్ళీ యివతలకు రాగానే మీ ''నేమ్ బోర్డ్'' కనిపించింది. పేరు చూడగానే మీరు చటుక్కున కనిపించారు. పలుకరించి పోదామని లోపలకు వచ్చాను. సమయానికి మీరు యింటిదగ్గరే వుండడం, నన్ను ఆదరించి పలుకరించి లోపలకు రానివ్వడం చాలా సంతోషంగా వుంది' అన్నాడు ప్రభాకరం జేబురుమాలు తీసి ముఖం తుడుచుకుంటూ.

పొట్టి మనిషి, స్థూలకాయుడు. కాస్త ఎండలో నడిచి వచ్చాడు గనుక యీ మాత్రం అలసటగా కనిపించడం సహజమే – అనుకున్నాడు నారాయణ.

గిరిజ లోపలనుంచి హాలలోకి వచ్చింది. ఒక ట్రేలో రెండు చల్లటినీళ్ళ గ్లాసులు తెచ్చి వాళ్ళముందు వుంచింది.

ప్రభాకరం ఆతురతగా ఒక గ్లాసు అందుకుని గటగట తాగేశాడు.

'టీ తీసుకుంటారా? కాఫీయా?' అని అడిగింది.

'ఏమీ తీసుకోను. మరో గ్లాసు చల్లటి నీళ్ళు యివ్వండి చాలు', అన్నాడు ప్రభాకరం.

అతను మొగమాట పడుతున్నాడని స్పష్టం అయిపోయింది నారాయణకు. 'ఫరవాలేదు. కాఫీ, టీ అలవాటు లేకపోతే చిక్కటి హార్లిక్స్ తాగండి. నేను ఎలాగూ యిప్పుడు పుచ్చుకుంటాను', అన్నాడు నారాయణ.

'అబ్బెబ్బె అందుకు కాదు. నేను యేమీ తాగను. మీరేం అనుకోకండి. తిన్నగా యింటికి వెళ్ళాక భోజనం చేస్తాను అంతే. మంచినీళ్లు రెండుమూడు గ్లాసులయినా అవలీలగా తాగేస్తాను' అన్నాడు ప్రభాకరం.

అన్నట్లుగానే తాగాడు కూడా.

అరగంటసేపు కూర్చున్న తరువాత తనుయేమీ పనిలేకపోయినా, ఊరికే పలుకరించిపోదామని వచ్చానని మళ్లీ చెప్పాడు.

'నమక్కల్‌లో హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్‌గా వెళ్లాను. ఆ కాలేజికే వైస్‌ప్రిన్సిపల్ కూడా చేశారు నన్ను, రెండో సంవత్సరమే. మరో యేడు అక్కడే ఉంటే ప్రిన్సిపల్‌కూడా అయ్యేవాడిని. అసలు నాకు ఆ ఉద్యోగం యివ్వటానికే నన్ను మదరాసు నుంచి అక్కడకు

లాక్కు వెళ్లారు వాళ్లు' అన్నాడు.

వాళ్లు ఎవరు? అని అడగలేదు నారాయణ. అవసరం అయితే అతనే చెబుతాడని నిదానంగా వుండి పోయాడు. 'అక్కడ వున్నప్పుడే చివరి సంవత్సరం చాల సుస్తీ చేసింది. వైద్య సహాయం లేదు. మదరాసు తెచ్చి ఆస్పత్రిలో పడేశారు. ఏదో రకరకాల రోగాల పేర్లు చెప్పారు. ఆ వివరాలన్నీ నాకు తెలియవు. బాగా తెలివి వచ్చి చూసేటప్పటికి కోడంబాకంలో యీ యింట్లో వున్నాను?

'అలాగా! బాగా విశ్రాంతి అవసరం అయిందన్న మాట!'

'ఆహా! ఉద్యోగం చేయటానికి పనికిరాను. హాయిగా తిని కూర్చుని రెస్ట్ తీసుకోవటమే కొన్ని సంవత్సరాల దాకా – అన్నారు. ఇప్పుడే నాలుగయిదు నెలలనుంచి కాస్త బయటకు, బజారుకు తిరుగుతున్నాను.

'నారాయణకు అతని పరిస్థితి వింటూవుంటే జాలి అనిపించింది. అనారోగ్యం మనిషికి యెంత నిస్సత్తువ చేస్తుంది. నిస్సహాయుడుగా తయారు చేస్తుంది!

'మీరు యిక్కడే వున్నారని ఎరుగుదును. అయితే యీ యిల్లు, ఫలానా వీధి అని ఎరగను. ఇవేళ అనుకోకుండా తటస్థపడింది మిమ్మల్ని చూడడం. నేను నిజంగా ధన్యుడిని అయిపోయినానని చెబితే మీరు నమ్మరు. ముఖస్తుతిగా మాట్లాడుతున్నాననుకుంటారు కదూ?'

'ఏమీ అనుకోను. ఒక్కోసారి అలా జరుగుతూ వుంటాయి. యాంగ్ దీన్నే ''సింక్రానిసిటీ'' అంటాడు గదూ' అని గుర్తు చేశాడు నారాయణ.

'పదేళ్ల నుంచి మిమ్మల్ని కలుసుకోలేదన్న మాటేగాని, కనీసం ఓ వందమార్లయినా తలుచుకుని వుంటాను. బొత్తిగా రెండు నెలలు నుంచి కనీసం పాతిక మార్లయినా అనుకుని వుంటాను. కాని ఎలా సందర్భపడుతుంది అని ఆలోచించనే లేదు.'

'ఓ ఉత్తరం వ్రాయాల్సింది నాకు. మీకు అంత జబ్బు చేస్తే ఒక్కమారయినా వచ్చి చూచి వుండేవాడిని. నమక్కల్ ఎక్కడ?' అనడిగాడు నారాయణ.

'సేలం నుంచి పైకి – అంటే కిందికి వెళ్లాలి. అయినా నేను యిక్కడే వున్నానుగా. మదరాసులోనే సుస్తీ, విశ్రాంతి అన్నీ నడుస్తున్నాయి.'

ఇద్దరూ అడ్రెస్ కార్డులు యిచ్చిపుచ్చుకున్నారు.

'ఎప్పుడేనా కోడంబాకం వయిపు వస్తే మాయింటికి తప్పకుండా రండి, మీరిద్దరునూ!' అన్నాడు ప్రభాకరం.

నారాయణ యింట్లో నుంచి కదలడు. ఎంతో అత్యవసరం అయితే తప్ప, బయటకు వెళ్లడు. అందుకు కారణాలు. ముఖ్యంగా నగరంలో తిరగాలంటే కారు లేకపోతే అసౌకర్యం. ఆటోచార్జీలు భరించడం కష్టం. ప్రభాకరాన్ని చూస్తే తప్పకుండా ఒకమారు అతని యింటికి వెళ్లి భార్యాపిల్లలను కూడా పలుకరించి ఊరడింపు మాటలు చెప్పాలనిపించింది.

'అట్లాగే వస్తాం. రేపు సాయంత్రం. ఇంట్లోనే వుంటారు కదూ!' అనడిగాడు నారాయణ.

'మీరు వస్తానంటే తప్పకుండా యింట్లోనే వుంటాం అందరమూ' అన్నాడు ప్రభాకరం. వస్తానన్నమాట వినడంతోటే అతని ముఖం వికసించడం నారాయణకు స్పష్టంగా కనిపించింది. నిజంగా వస్తే యింకా యెంత ఆనందిస్తాడో.

ప్రభాకరం కారులో వచ్చాడనుకున్నాడు నారాయణ. కాదు కాలినడకనే వచ్చాడని రూఢి అయింది.

కారు యేం చేశాడు! బహుశ ఆస్పత్రి ఖర్చులకోసం అమ్మివేసి వుంటాడు! 'ఇప్పుడు యింటికి ఎట్లా వెడతారు.' అనడిగాడు, ప్రభాకరం వెళ్లి పోవటానికి సిద్ధపడుతూ వుండగా.

'ఇక్కడనుంచి మైలపూర్‌కు 6డి బస్‌లో వెడతాను. అక్కడ 12బి వస్తుంది అది ఎక్కానంటే అరగంటలో మా యింటి ముందు ఆగుతుంది.'

'మనం యిప్పుడు సాలిగ్రామం వెళ్లాలి. గుర్తుందా మీకు? కొడంబాకం ఆ దారిలోనే అయితే మనం వీరిని యింటి ముందు డ్రాప్‌చేసి వెళ్ళొచ్చు' అంది గిరిజ లోపలినుంచి వస్తూ.

నారాయణకు అప్పుడు గుర్తుకు వచ్చింది. అవును! ఈ రోజు సాలిగ్రామంలో ఒక మిత్రుడు భోజనానికి రమ్మన్నాడు. వస్తామని ప్రామిస్ కూడా చేశారు అతనికి యిద్దరూ.

11)



అయితే సాలిగ్రామం, కోడంబాకం ఒక వైపు వున్నాయా. ఉత్తర దక్షిణ ధృవాలా అన్న సంగతి నారాయణకు తెలియదు. ఆ విషయమే నారాయణ అడిగాడు.

'కొద్దిగా చుట్టు. అయినా ఫర్వాలేదు. దారిలోనే అనుకోవచ్చు' – అన్నాడు నారాయణతో ప్రభాకరం. 'బస్సులయితే కోడంబాకం మీదుగానే వెడతాయి. ఆటోవాళ్లకు మరేదో షార్ట్‌కట్ వుంది.'

'షార్ట్‌కట్ అక్కర్లేదు లెండి. మిమ్మల్ని మీ యింటి దగ్గర డ్రాప్ చేసి వెళతాం మేం. ఒక్క అయిదు నిమిషాలు కూర్చోండి. మేం రెడీ అయివస్తాం.' అని నారాయణ లోపలకు వెళ్లాడు. గిరిజ అప్పటికే ప్రయాణానికి సిద్ధమయిపోయి వుంది.

ఆటో రిక్షాలో వెడుతున్న అరగంట సేపు తన పరిస్థితి మరింత వివరంగా చెప్పాడు ప్రభాకరం. అతను యెంత విడమరచి చెబుతున్నాననిపించినా నారాయణకు అర్థం అయింది మాత్రం తక్కువే.

అయినా అతనికి మాత్రం మనస్సులో ఒక విషయం నిర్ధారణ అయిపోయింది. ప్రభాకరం పైకి ఎంత తేలకపోయినా – యెంతో నిర్వేదంలో వున్నాడు. అతనికి ఎవరయినా మానసిక వెనులుబాటు కలిగించేవాళ్ళ అవసరం ఎంతయినా వుంది.

ఒక పదిరోజుల పాటు తానే ఆ పని యెందుకు చేయగూడదు? ప్రయాణాలు, పనిలేకపోయినా రికామీగా తిరగడం తనకు అలవాటు లేకపోయినా, వెదుక్కుంటు వచ్చిన యీ పరిచయస్థుడికి ఈ మాత్రం ఉపకరించకపోవడం ధర్మం కాదనిపించింది కూడా.

మనసుకు ధైర్యం చెప్పేవాళ్ళు కావాలి.

అతను చెప్పిందంతా ఓపిగ్గా వినేవాళ్ళు కావాలి.

ఇప్పుడిప్పుడే మళ్ళీ ప్రపంచంలోనికి వస్తున్న అతనికి బాసటగా 'నీకు నేనున్నాను' అని ధైర్యంగా చెప్పగలవాళ్ళు కావాలి.

నారాయణ నిర్ధారణ చేసుకున్నాడు.

పదిరోజులపాటు ప్రతిసాయంత్రమూ అతని దగ్గరకు వెడతాడు. రోజుకు వంద రూపాయిలు ఖర్చు అయితే మునుకేం? ఆ మాత్రం అసరా యివ్వకుండా అంటీ ముట్టిన ట్లువుండడం తనకు చేతకాదనిపించింది నారాయణకు.

ప్రభాకరాన్ని అతని యింటివరకు డ్రాప్ చేస్తూ 'రేపు సాయంత్రం తప్పకుండా వస్తాం. అంతేకాదు. పదిరోజులపాటు రోజూ సాయంత్రం నేను వచ్చి వెడుతూ వుంటాను. మీరు జాగ్రత్తగా వుండండి.' అన్నాడు.

అలా రూపొందింది యీ అసహాయ సహకార కార్యక్రమం.

లాభం లేని పనులు చేయగూడదని నియమంలేదుగనుక నారాయణకు యీ ప్రయాణాలు ఎక్కువ యిబ్బంది అనిపించలేదు. కాకపోతే తాను నాలుగుగంటలకే తయారవాలి. నాలుగున్నర కల్లా బస్ పట్టుకోవాలి. రెండు బస్సులు మారాలి. బస్సుల కోసం కొద్దిదూరం నడవాలి. స్టాప్‌లో వెర్రిముఖం వేసుకుని రావలసిన బస్ కోసం కాచుకుని వుండాలి. 'పీక్ టైం' గనుక బస్‌లో నిలబడే ప్రయాణం చేయాలి – చాలా దూరం, దాదాపు చివరి వరకూ. స్టాప్‌లో వేచినిలుచున్నప్పుడు, తాను యితరులకు సర్వజ్ఞుడులాగా కనిపిస్తాడోయేమో, రకరకాల ప్రశ్నలు ఎదురవుతాయి. ఫలానా నంబర్ బస్ యిక్కడకు వస్తుందా? ఫలానా చోటుకు వెళ్ళాలంటే యే బస్ ఎక్కాలి? ఇంతకంటే మరో దగ్గర దారి యేమయినా సూచించగలరా? – అడిగిన వాళ్ళు తన కంటే జ్ఞానులే అనుకుంటాడు గనుక 'నాకంతగా తెలియదు, యింకెవరినయినా అడగండి' అని చెప్పడంలో అతనికి నామోషీ ఏమీ లేదు గాని, వాళ్లు ఒకపట్టాన నమ్మరు తనమాట. ఇంత పెద్దమనిషిలా కనిపిస్తున్నావు, ఆ మాత్రం తెలియదా? – అన్నట్లు చూస్తారు కొందరు. ఏమీ తెలియకుండా యిక్కడెందుకు నించున్నావు? అన్నట్లు వుంటుంది మరికొందరి ధోరణి. తోటి ప్రయాణీకులతో యీ బాదరబందీ వుంటే, ఆటో రిక్షా వాళ్ళతో మరో కొత్తరకం యిబ్బంది. ప్రతి ఖాళీ ఆటో అతని ముందే ఆగి అతని ముఖంలోకే గుచ్చి చూస్తాడు డ్రయివర్. ఆటోలో హాయిగా తీసుకువెడతాను, యీ బస్సులు ఒకంతటరావు, వచ్చినా సీటు వుండదు, నించున్నా కూర్చున్నా సుఖం లేదు. జేబుదొంగలుంటారు. మీటర్ మీద ఒక్క అయిదు రూపాయలు 'పోట్టి కుడుంగో' (చేర్చి యివ్వండి) యిలా రకరకాలుగా ప్రలోభపెడతారు. ఆటోలో వెళ్ళడానికి పైసలు లేవా అన్నట్లుగా యెగతాళిగా చూస్తారు గూడా కొందరయితే.

అలా అన్ని యిబ్బందులు గడుస్తూ అనుకున్న పని పూర్తి చేసకుంటూ వస్తున్నాడు నారాయణ –నింపాదిగా.

అయిదో రోజు ఒక విచిత్రం జరిగింది.

ఆ రోజు నిజానికి ప్రత్యేకంగా యెలాంటి యిబ్బందీ కలుగలేదు. ఎక్కువసేపు వెయిట్ చేయవలసిన అవసరం లేకుండానే బస్సులు వెంట వెంటనే దొరికాయి.

పది నిమిషాలు తక్కువ ఆరు గంటలకు నారాయణ అనుకున్న చోటున బస్ దిగాడు. దిగీ దిగడం తోటే గడియారం చూసుకున్నాడు. అమ్మయ్య – అనుకున్నాడు. బస్ ముందుకు వెళ్ళిపోయింది. నారాయణ ఒక్కడూ స్టాప్‌లో మిగిలిపోయాడు. తతిమ్మా ప్రయాణికులు జరజర పుట్టలోనుంచి బయటపడిన పాముల్లాగా రోడ్డు మీదికి ఎగబాకిపోతున్నారు. నారాయణ ఎదురుగా కనిపించిన దుకాణం బోర్డు వైపు చూశాడు. ఏదో పెద్ద దుస్తుల దుకాణం. లోపల దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. అంత పెద్ద దుకాణంలోనూ యిద్దరు ముగ్గురు కంటే కస్టమర్లు లేరు. సేల్స్‌మెన్ మటుకు పదిపదిహేను మంది రోడ్డు మీదికే కనబడుతూ నిలుచునివున్నారు. కాష్‌కౌంటర్ దగ్గర ఆసామి అప్పుడే అగరువత్తులు వెలిగించి గోడకు వేళాడుతున్న పటాలముందు సున్నాలుగా చుడుతున్నాడు. మనసులోనే యేదో మంత్రం జపిస్తున్నాడు.

నేనెక్కడ వున్నాను? నేను యిక్కడికి యెందుకు వచ్చాను? – యీ రెండు ప్రశ్నలూ నారాయణ మనస్సులో నిలిచాయి.

ఇప్పుడే బస్ దిగిన గుర్తు కూడా లేదు.

దుస్తులు వేలాడుతూ వుండడం చూచి అతనికీ యేదో కొనుక్కోవాలనిపించింది. చాలా రోజులనుంచి మనస్సును వేధిస్తోంది ఒక కోరిక. మంచి రేమాండ్ సూట్ కొనుక్కోవాలి. ఈ మారు సెమినార్‌కు వెళ్ళినప్పుడు కొత్త సూట్‌లో వెళ్లాలి –అని రెండు సంవత్సరాల నుంచి అనుకుంటూ వున్నా, సందర్భపడలేదు. మూడు వేల నుంచి ముప్ఫయి వేలవరకు వున్నాయి ధరలు. కనీసం అయిదు వేలన్నా ఖర్చు చేస్తేగాని తగు మాత్రం 'సూటొ' దొరకదు. పోనీ ఎలాగూ దుస్తుల దుకాణం ముందే వున్నాను గనుక లోపలకు వెళ్ళి విచారిస్తే మటుకు నష్ట మేమిటి? తీరా కావలసిన సరుకు దొరికితే, కొనడానికి తనదగ్గర డబ్బులేదు. యాభయి రూపాయల కాగితం మటుకే జేబులో వేసుకుని బయలుదేరాడు యింటి దగ్గర నుంచి. గిరిజకు చెప్పలేదు. డబ్బు లేక పోతే మటుకేం, క్రెడిట్‌కార్డు వుంది జేబులో. ఫరవాలేదు. అయిదువేలు అప్పుచేసినా యిబ్బంది లేదు, సరయిన సూట్ దొరకాలిగాని.

దుకాణంలోకి అడుగు పెడదామా అనుకుంటూ వుండగానే ఎవరో భుజం తట్టారు. 'ఏమిటి యిక్కడ నించున్నారు? నారాయణగారే గదూ మీరు?' అని పలుకరించాడు ఆ ఆసామీ.

'అవును. నేనే...మీరు?' అన్నాడు నారాయణ వెంటనే.

'ముప్పయి యేళ్ళ క్రితం ఢిల్లీలో కలిసి పనిచేశాం మనం. రండి. రండి మా యింటికి వెడదాం' అన్నాడు ఆ మనిషి ఆతురతగా.

'మీరెవరో గుర్తు రాలేదు.'

'గుర్తురాదు నిజమే. ఒక రోజూ...ఒక సంవత్సరమా? ముప్ఫయేళ్ల కిందటిమాట. పోయినవారం, విశ్వామిత్రుడు కనిపించి మీరు యిక్కడే వున్నారని చెప్పాడు–'

'విశ్వామిత్రుడెవరు?'

'మహర్షి కాదులేవయ్యా. మనతోపాటు వుండేవాడు. వాడే, ఆడిట్ డిపార్ట్‌మెంట్ హెడ్. అయినదానికీ కానిదానికీ అందరి మీద విరుచుకుపడుతూ వుండేవాడు. వాడికి విశ్వామిత్రుడని పేరు తగిలించింది మీరే కదూ?' అన్నాడు అతను, యింకా నవ్వుతూనే.

నారాయణకు గుర్తు చిక్కలేదని తెలిసిపోయి ఆ ఆసామి మరింత నింపాదిగా 'నేను కేశవ మూర్తిని. మీరు డిఫెన్స్‌లో డిప్యూటీ సెక్రెటరీగా వున్నప్పుడు ఎగ్రికల్చర్‌లో నేను జాయింట్ సెక్రటరీగా వుండేవాడిని. గుర్తు వచ్చిందా? రామకృష్ణాపురంలో యెదురెదురు యిళ్ళలో వుండేవాళ్ళం. తరువాత నేను హర్యానాకు పేరంట్ డిపార్ట్‌మెంట్‌కు రివర్ట్ అయిపోయాను...' అన్నాడు.

అవును కాబోలు... సర్వీస్ వున్నప్పుడు ఎందరో యిలాంటి డిప్యూటీలు, జాయింట్‌లూ కలిసి మెలిసి తిరుగుతూ వుండేవాళ్ళు. ఉద్యోగం నుంచి రిటైర్ అయిపోయిన తర్వాత యింకా పాతభావాలన్నీ వల్లె వేసుకుంటూ వుండడం నారాయణకు చేతకాని పనుల్లో ఒకటి. అసలు ఉద్యోగంలో వున్నప్పుడు కూడా అంతంత మాత్రంగానే వుండేవాడు. ఎవర్నయినా వాళ్ళ ఆఫీసులో కనిపించినప్పుడే గమనించగలిగేవాడు గాని తరువాత కరోల్‌బాగ్‌లోనో కన్నాట్‌సర్కిల్‌లోనో తారసపడినప్పుడు ఫలానా అని గుర్తు తెలిసేది కాదు.

అందుకనే 'అహంభావి' అనే పేరు కూడా సంపాదించుకున్నాడు. అహం అనేది కించిత్తయినా లేకపోయినా.

'ఏమిటి ఏమయినా షాపింగ్ చేయాలా? రండి, నేనూ సహాయం చేస్తాను' అన్నాడు కేశవమూర్తి.

'అబ్బే షాపింగ్ యేం లేదు. ఏం తోచక యిటు షికారుగా వచ్చాను..' అన్నాడు నారాయణ 'యిక్కడకు యెందుకు వచ్చానో గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాను' అని ఆయనకు చెప్పడం యిష్టం లేక.

'సరే. పనేమీ లేకపోతే పదండి మా యింటికి వెళ్ళి తీరుబడిగా మాట్లాడుకుందాం...' అంటూ కేశవమూర్తి అతన్ని తొందరపెట్టినంత పనిచేశాడు.

అతని వెనకాల వెళ్ళడం తప్ప ఆ క్షణంలో యింకేం చేతకాలేదు నారాయణకు.

అక్కడి నుంచి నాలుగు నిమిషాల నడకలో కేశవమూర్తి యింటికి చేరుకున్నారు యిద్దరూ.

'కుబేరా' ఫ్లాట్స్‌లో త్రీ రూమ్ ఎకామడేషన్.

కేశవమూర్తి భార్య కూడా పలుకరించింది.

కాఫీ యిస్తూ 'వదినగారు కులాసాగా వున్నారా? ఎప్పుడయినా తీసుకురండి. మా గోపాల్ మీ యింట్లోనే పెరిగాడు. వాడికి అత్తయ్యగారంటే యిప్పటికీ గుర్తే' అంది.

'గోపాల్ యిప్పుడెక్కడ వుంటున్నాడు?' అనడిగాడు నారాయణ, యేమీ అడగకుండా వుంటే బొత్తిగా బాగుండదని.

'మొన్నటి దాకా గౌహతిలో వుండేవాడు. ఓ యేడాది అయింది, యు.యన్.ఓ.కు వెళ్ళి అసిస్టెంట్ జనరల్ సెక్రటరీకి ప్రధమ సహాయకుడుగా వున్నాడు' – అని చెప్పాడు కేశవమూర్తి.

'మీరిద్దరూ ఆరోగ్యంగా వున్నారు గదా! నాకు మాత్రం మైగ్రేన్ తలనెప్పి యింకా తగ్గనే లేదు' అంది కేశవమూర్తి భార్య.

'అమెరికా నుంచి నీ కొడుకు మందులు పంపుతున్నంతకాలం, నీ తలనెప్పి సురక్షితంగా నీతోనే వుంటుంది –' అన్నాడు నవ్వుతూ కేశవమూర్తి.

'చూచారా అన్నయ్యగారూ! నా అనారోగ్యం గురించి ఆయన యిప్పటికి కూడా పట్టించుకోవడం లేదు. పైగా ఎగతాళిగూడాను!'

కేశవమూర్తి మాటల్లోనే చెప్పాడు; పెద్దకొడుకు కెనడాలో ఇంజనీరింగ్ కాలేజికి హెడ్‌గా వున్నాడనీ, అమ్మాయి ఆస్ట్రేలియా మొగుడితో సిడ్నీలోనే కాపురం వెలగబెడుతోందని.

'సర్వీస్‌లో వున్నన్నాళ్ళు యేమీ సుఖంలేదు. ఇప్పుడు విదేశీడాలర్లు మనకు కావలసిన సుఖం యిస్తున్నాయి. అంత్య కాలంలో ఆనందం కలిగించే విషయం యిదొక్కటే.'

– నారాయణకు యిలాంటి మాటలు వినడం అలవాటు అయిపోయింది. ఏ ఊరికయినా వెళ్ళు. ఏ యింటికయినా వెళ్ళు తమ వాళ్ళు యెవరెవరు యేయే దేశాల్లో వైభవంగా రోజులు వెళ్ళదీస్తున్నారో చెప్పుకు ఉబలాటపడడం...మనం తప్పనిసరిగా వినవలసిరావడం!

గ్లోబలైజేషన్ పుణ్యమా అని అందరూ అన్ని దేశాలకూ పాకిపోతున్నారు. పై దేశాలతో వ్యాపార సంబంధాలు మటుకే వుండేవి పూర్వం. ఇప్పుడు ఉద్యోగ సంబంధాలు, సాంసారిక సంబంధాలూను! చదువుకోవడం మొదలు చదరంగం ఆడడం వరకూ విదేశాలలోనే జరిగిపోవాలి.

ఇక్కడేముంది? నదీజలాల పోట్లాటలు, క్రాస్ బార్డర్ టెర్రరిజం, హైవే రాబరీతప్ప! ఇలాంటివన్నీ అన్ని దేశాలలోను వున్నాయనీ, మనం దూరంగా వున్నాం గనుక ఆ వివరాలు మనకు అర్థం అయి చావవనీ తొందరగా తోచదు.

తెలుగు వార్తాపత్రికలు, వారపత్రికలు కనిపించాయి కేశవమూర్తి యింట్లో. 'మన దేశం ఎలా వుందో ఎప్పటికప్పుడు తెలుసుకోకపోతే నాకు నిద్రపట్టదు. అందుకని అన్నిటికీ చందాలు కట్టితెప్పిస్తున్నాను. అవి చదువుకోవటమే నాకు ముఖ్యమైన కార్యక్రమం యిప్పుడు – ' అన్నాడు కేశవమూర్తి. భార్య లోపలికి పోయిం తర్వాత రహస్యం చెబుతున్నట్లుగా యిదంతా దండగమారి ఖర్చు అంటుంది మా ఆవిడ. దేశం ఎట్లాపోతే

మనకేం? ఈ మాత్రం చల్లగా వున్నందుకు రెండునెలల కొకసారయినా తిరుపతికి, రామేశ్వరానికీ ప్రయాణం చేయిస్తుంది,' అన్నాడు.

అయోధ్య, ద్వారక, ఋషీకేశం, బదరీ - యివన్నీ సర్వీస్‌లో వున్నప్పుడే చుట్టబెట్టడం అయిపోయిందని కూడా చెప్పాడు.

తమను గురించి అంతా చెప్పడం అయిపోయిందనుకున్నాక, నారాయణను అతని వివరాలన్నీ గుచ్చి గుచ్చి అడిగి మరీ జవాబులు చెప్పించుకున్నాడు.

'మీ రేమీ మారలేదు,'అన్నాడు చివరకు.

మారకం కాకుండా నిలిచి పోయినందుకు మనసులోనే సంతోషించాడు నారాయణ.

'అడయారులో యెక్కడ వుంటున్నారు? మర్రిచెట్టు చూచారా యెప్పుడయినా!'

నారాయణ జవాబు చెప్పాడు.

'మర్రిచెట్టు యిప్పుడు లేదటగా. పది పన్నెండేళ్ళ క్రితం వచ్చిన గాలిదుమారానికి నేలమట్టం అయిపోయిందని పేపర్లో చూచాను.'

'నిజమే. కాని యిప్పుడు చూస్తే అప్పుడు పడిపోయిందన్నమాట నిజం కాదేమో అనిపిస్తుంది.'

'అవునా. యింకా మర్రి చెట్టు వుందా?'

'వుంది. పడిపోయిన జాడలేమీ కనబడవు. మూలం, ఊడలు అన్నీ అలాగే సురక్షితంగా వున్నాయి. అది యింకా పెరిగి నగరమంతా ఆక్రమించకుండా మటుకు చుట్టూ కంచె కట్టారు.'

'ప్రపంచంలోకల్లా అదే పెద్దది. మన దేశంలోనే నాలుగయిదు వున్నాయి. కలకత్తాలో చెట్టు పెద్దది. అనంతపురం దగ్గర, బెంగుళూరు పరిసరప్రాంతంలోను చాలా పెద్దసైజు చెట్లే వున్నాయి....'

'అలాగ! అన్నట్లు బెంగళూరంటే గుర్తు వచ్చింది....అతను యేమయినట్లు?'

'ఎవరు?'

'అదే గంధపు చెక్కల గజదొంగ'

'అప్పుడప్పుడు వార్తల్లో కనిపిస్తూ వుంటాడు.'

'అతన్ని పట్టుకోక పోవడంలో యేదన్నా రాజకీయం వుందంటారా?'

'ఏమో తెలీదు. అతన్ని పట్టుకోవడానికి అయిన - అవుతున్న ఖర్చుతో యింకెన్నయినా అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చని ఎవరూ రాయరు పత్రికల్లో.....'

'ఒక మనిషిని పట్టుకోలేకపోవడం మన సావరనిటీకే మచ్చ!'

'పోనిద్దూ, ఆ తెగని సమస్య మనకెందుకు? ఎందరినని పట్టుకుంటారు, అందరూ దొంగలే గదూ!'

'సర్వ వ్యాపకత్వం'.

కాస్సేపు ఇద్దరూ యేమీ మాట్లాడలేదు.

పైకి చెప్పరాని - చెప్పలేని - ఆవేశంతో యిద్దరి మనసులూ కుతకుత లాడిపోతున్నాయి.

'నారాయణా, మీరు యిదివరకు కథలు, నవలలు వ్రాసేవారు కదూ, ఇంకా రాస్తున్నారా?' అనడిగాడు కేశవమూర్తి, టాపిక్ మారుస్తూ.

నారాయణ నవ్వి వూరుకున్నాడు.

'మంచితనం పెంచమని మీరు అప్పుడెప్పుడో వ్రాసిన వ్యాసం ఒకటి పత్రికల్లో చదివాను. బాగుంది.'

'బాగుంది, సరే. మంచితనం ఎవరికి ఎవరు పెంచాలి?'

'అందరూ పెంచాలని మీరు సూచించారు.'

'అవునా? అందరు చేయాల్సిన పని కనుక ఎవరికి వారు అది తమ పని కాదనుకుంటున్నారు అనిపిస్తోంది నాకు!'

'కలెక్టివ్ రెస్పాన్సిబిలిటీ! ప్రతి ఒక్కరిదీ ఆ పని!'

'అలా అందరూ అనుకోవడం లేదు. ఇతరులంతా మంచి పనులు చేయాలని,

మనం మటుకు వాటిని మెచ్చుకుంటూనో, నిరసిస్తూనో గట్టుమీదనే సురక్షితంగా వుండాలనీ ఎవరికి వారు అనుకుంటున్నారు.... ఆ మధ్య నలుగురయిదుగురు కాలేజి విద్యార్థులు నాదగ్గరకు వచ్చారు. వాళ్లేమన్నారో తెలుసా? మంచిగా వుండాలని మాకు అనిపిస్తోంది. కాని మంచిగా వుండడం ఎట్లాగో అర్థం కావడం లేదు.' అన్నారు. ఎవరుగానీ ఎంత మంచిగా వుండదలుచుకుంటారో అంతే మంచిగా వుండగలుగుతారు. మంచిగా వుండడం మన మూల లక్షణం. పైపై మెరుగులు మంచితనాన్నికప్పి వేయకుండా చూచుకోండని మాత్రం చెప్పగలిగాను.'

'ఆ మాటా నిజమే!' అన్నాడు కేశవమూర్తి. ఒక క్షణం అగి 'అరవయి, డెబ్బయేళ్ళు యింకా వచ్చిన తర్వాత ఒక్కమారు వెనక్కు తిరిగి చూచుకుంటే....మనం యింకా మంచిగా వుండగలిగే వాళ్ళమే, కాని వుండలేకపోయాం సుమా అనిపిస్తుంది యిప్పుడు', అన్నాడు.

'మంచితనంలో పుష్పించాల్సిన మనిషి, అనేక కారణాలవల్ల తన జండాను గాలిలో ఎగురవేస్తున్నాడు. ఊగిసలాడుతున్నాడు తీరా పనిదగ్గరకు వచ్చే సరికి-! స్థిరమైన నడువడి జనులకెల్లరకు వలయు --అని మన చిన్నప్పుడు కపిలవాయి రామనాధశాస్త్రి దనుకుంటాను, ఓ గ్రామ ఫోన్ రికార్డ్ వుండేది. ఆ పాట నాకు అప్పుడప్పుడు చెవుల్లో విసురుగా వినిపిస్తుంది, యిప్పటికి కూడా....'

కేశవమూర్తి, భార్య 'బాగా గుర్తు చేశారండి, అన్నయ్యగారు! ఈ టి.వి.లు, వి.సి.డిలు యివన్నీ వచ్చాక గ్రామఫోన్ అపురూపం అయిపోయింది. ఇప్పుడు చూద్దామన్నా ఎక్కాడా కుక్కబొమ్మ గ్రామఫోన్ ప్లేట్లు కనబడడం లేదు' అంది.

'పి.సి వచ్చాక మాన్యువల్ టైప్‌రైటర్ కనబడుతుందేం? మార్పు సహజం. మారకుండా వుండ వలసినవి విలువలు, వస్తువులు కాదు.'

'బాగా చెప్పారు -' అంటూ ఆమె మళ్ళీ కాఫీ యిచ్చింది యిద్దరికీ.

'కాఫీ తాగడం తోటే మన ఆనందాన్ని సరిపెట్టుకోగలుగుతున్నందుకు సంతోషంగా వుంది కదూ!-' అని హాయిగా నవ్వుకున్నారు ముగ్గురూ.

కాఫీ కప్పు బల్ల మీద పెడుతూవున్నప్పుడు గుర్తు వచ్చింది నారాయణకు తను యింకా యింటికి వెళ్ళకపోతే గిరిజ ఖంగారు పడుతుందని.

తను ఎక్కడున్నాడు? ఇక్కడికి ఎందుకు వచ్చాడు? వెనకటి ప్రశ్నలు మళ్ళీ మెదడులో మెదిలాయి.

సమాధానం కోసం బుర్ర తడుముకున్నాడు. 'వస్తానండీ ఇక. బాగా చీకటిపడిపోయినట్లుంది--' అన్నాడు తెగించి.

'అంతదూరం ఒక్కడివే ఎలా వెడతావు'. ఒక నిమిషం ఆగు. డ్రయివర్‌కు ఫోన్ చేసి రప్పిస్తాను. నిన్ను కార్లో డ్రాప్ చేసివస్తాడు భద్రంగా' - అంటూ లేచాడు కేశవమూర్తి. ఛటుక్కున యేదో గుర్తు వచ్చినట్లు 'అన్నట్లు, యిక్కడికి దగ్గరలోనే ప్రభాకర్ అని ఒకతనువున్నాడు. అతను వారం రోజుల కిందట అడిగాడు నిన్ను - నిన్ను నేను ఎరుగుదునా? అని దారిలో అతన్ని కూడా పలుకరించి వెడదాం, యేం?' అన్నాడు.

ప్రభాకర్ పేరు వినగానే నారాయణకు అసలు తను కోడంబాకం యెందుకు వచ్చాడో చప్పున గుర్తువచ్చింది. అతన్ని చూడకుండా యింటికి వెళ్ళడం లేదని ఆనందం అయింది. ఆలస్యం అయితే మటుకేం, అనుకున్న పని అనుకున్నట్లుగా జరుగుతోంది!

❀

*(పత్రిక - 1, 2003)*